


బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT



తెలంగాణ ,ఆంధ్ర
విలేకరులు కావలెను
WANTED REPORTER'S
విలేకరిగా నాకు అవకాశం ఏవరైన ఇస్తే బాగుండు అనుకునేవారికి.ఆ అవకాశం మా డైలీరిపోర్ట్ తెలుగు దినపత్రిక మరియు టీవీ చానల్ మీకు ఇస్తుంది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న అన్ని
జిల్లలాకు, బ్యూరో లు, నియోజకవర్గాలు,మండలాల వారీగా కావలెను.
CONTACT US
www.dailyreporttelugu.com
+91 8501919707



సంపుటి: 1 | సంచిక: 137 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | శుక్రవారం 20-12-2024 | వెల: 5/రూ -


## పార్లమెంటు ఆవరణలో

# బాహాబాహీ!

అంబేద్కర్‌పై షా వ్యాఖ్యల వివాదంఇండియా, ఎన్‌డీఏ ఎంపీల

పోటాపోటీ నిరసనలు మకరద్వారం వద్ద తోపులాట

ముఖేశ్ రాజ్‌పుత్‌ను రాహుల్ బలంగా తోసేశారు

ఆయన ప్రతాప్ సారంగిపై పడ్డారు మా ఎంపీలకు గాయాలయ్యాయి



న్యూఢిల్లీ, డిసెంబరు 19 భారతదేశ పార్లమెంటు చరిత్రలోనే ఎన్నడూ కనీవినీ ఎరుగని దృశ్యం గురువారం ఆవిష్కృతమైంది. అధికార, విపక్షాల మధ్య ఇప్పటివరకూ జరుగుతున్న మాటల యుద్ధం గురువారం భౌతిక దాడులకు దారితీసింది. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అవమానించారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఒకవైపు.. కాంగ్రెస్ పార్టీ అమిత్ షా మాటల్ని వక్రీకరించటమే కాక వారి హయాంలో అంబేద్కర్‌ను అవమానించారని పేర్కొంటూ అధికార పక్ష సభ్యులు మరోవైపు.. పార్లమెంట్ ప్రాంగణంలో పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఆ నిరసనలు తోపులాటకు దారితీసి ఉద్రిక్తత ఏర్పడింది. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు గాయపడి ఆస్పత్రి పాలు కాగా, ఆ పార్టీకే

2లో



## అనుకూల చరిత్ర రాయించుకున్నారు!

అదే నిజమైనదిగా భ్రమ కల్పించారు

దాంట్లో అమరులకు చోటు దక్కలేదు

కేసీఆర్ హయాంపై రేవంత్ వ్యాఖ్య

37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన సీఎం

ఔటర్ టెండర్‌పై సిట్ విచారణకు ఆదేశించిన రేవంత్

శాసనసభలోనే ప్రకటన

హరీశ్, కేటీఆర్ కోరిక మేరకే: సీఎం

2లో

# కక్ష సాధింపులొద్దు



- స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల సమయం కుదించం: సీఎం
- 79 'మున్సిపాలిటీల' పదవీకాలం వచ్చే మార్చికి పూర్తి
- మిగతావాటికి నవంబరు దాకా గడువు
- ఇంత తక్కువ సమయం ఉంటే పనిగట్టుకుని దించడం ఎందుకు?
- విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం.. సీఎం స్పష్టీకరణ
- పులివెందుల మంచినీటి పథకం కొనసాగింపు
- సంక్రాంతి తర్వాత కొనసాగనున్న రెవెన్యూ సదస్సులు
- దరఖాస్తుల లెక్క కాదు.. ఎన్ని పరిష్కరించారన్నదే ప్రధానం
- మంత్రుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే: చంద్రబాబు

2లో

మనకు కక్ష సాధింపులు అవసరం లేదు. విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం. ఉన్న సమయాన్ని మంచి పాలన అందివ్వడానికి వాడుకుందాం.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల లెక్క నాకు ముఖ్యం కాదు. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయన్నది ప్రధానం. పక్క టేబుల్ మీదకు తోసేయడంలో కొందరు అధికారులు నిపుణులు. అలా కాకుండా వాటిని సవ్యంగా పరిష్కరించే విధానాలపై దృష్టి పెట్టండి.

మంత్రులు ఫైళ్లను త్వరగా పరిష్కరించాలి. మీ వద్దకు వచ్చేవే గాక మీ శాఖకు వస్తున్నవి కూడా త్వరగా పరిష్కారయ్యేలా బాధ్యత తీసుకోవాలి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

# సభలో అప్పుల గోల..!

- ప్రభుత్వ అప్పులపై భట్టి వర్సెస్ హరీశ్
- పదేళ్లలో బీఆర్ఎస్ తీసుకున్న రుణాలు రూ.7.11లక్షల కోట్లు
- అప్పులకు అసలు, వడ్డీలే రూ.63 వేల కోట్లు చెల్లించాం
- ఆర్బీఐకి వివరాలిచ్చింది హరీశే
- ఎవరికి సభా హక్కుల నోటీసు ఇవ్వాలో చెప్పండి: భట్టి
- మేం తీసుకున్నది 4.17 లక్షల కోట్లే
- చేయని అప్పులను మా ఖాతాలో వేస్తే నోటీసులు: హరీశ్

2లో



# చంద్రబాబుది 420 విజన్

- అది మేనిఫెస్టోను ఎగ్గొట్టే రంగు రంగుల కథల పుస్తకం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు
- చంద్రబాబు ఏడు నెలల క్రితం ఇచ్చిన హామీలకే దిక్కు లేదు
- ఇప్పుడు 2047 విజన్ అంటుండటం ఆశ్చర్యం.. విజన్ అంటే మనిషి అభివృద్ధికి బాటలు వేయాలి

2లో

ఇవాళ ఆరు నెలలు గడవక ముందే చంద్రబాబు చెప్పిన మాటలు మోసాలై కంటికి కనిపిస్తున్నాయి. ఆ రోజు నేను ఎన్నికలప్పుడు చెప్పాను. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే అని. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తల పెట్టడమే అని. ఇవాళ 6 నెలలు తిరక్క ముందే అది కనిపిస్తోంది. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒకటే మాట వినిపిస్తోంది. జగన్ పలావు పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నాడు. పలావు, బిర్యానీ రెండూ పోయాయి. ఏమీ లేకుండా బాబు రోడ్డు మీద నిలబెట్టాడు అన్న చర్చ నడుస్తోంది.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





# చంద్రబాబుది 420 విజన్

అమరావతి: సూపర్ సిక్స్‌సహా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకే సీఎం చంద్రబాబు రంగు రంగుల కథలు చెబుతూ.. దానికి విజన్ 2047 అని పేరు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందుకే దాన్ని 420 విజన్ అంటారని మండిపడ్డారు. 'మనిషిని అభివృద్ధి బాటలోకి తీసుకుని పోవాలంటే.. ఆ అభివృద్ధి బాట ఏమిటని చెప్పేదే విజన్ డాక్యుమెంట్. ఇవాళ చిన్న పిల్లాడు 20 ఏళ్ల తర్వాత ఎలా ఉంటాడు? అప్పుడు అతడి భవిష్యత్ ఏంటి? ఆ భవిష్యత్ కోసం ఇవాళ సరైన అడుగులు వేస్తున్నామా? లేదా? అన్నదే విజన్. అందులో భాగంగా ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా వాటిని చేసి చూపింది' అని గుర్తు చేశారు. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపడమే అని, పులినోట్లో తలపెట్టడమే అని.. నేను ఎన్నికల ప్రచారంలో చెప్పాను. ఇవాళ ఆరు నెలలు తిరక్క ముందే అదే కనిపిస్తోంది' అని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం దగా చేయడంతో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అండగా గొంతు విప్పాలని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 'పగలు తర్వాత రాత్రి వస్తుంది. మళ్లీ మన టైం వస్తుంది. దేనికైనా మనం సిద్ధమే. ఎవ్వరూ, ఎక్కడా భయపడొద్దు. దేన్నైనా ఢీకొందాం. మీ అందరికీ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు పార్టీ అండగా ఉంటుంది' అంటూ నేతలకు భరోసా ఇచ్చారు. పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై నేతలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...

### జనవరి నుంచి జిల్లాల పర్యటన

జనవరి చివరి వారం నుంచి నేను పార్లమెంటు జిల్లాల్లో పర్యటిస్తాను. వారంలో ప్రతి బుధ, గురువారం రాత్రి అక్కడే బస చేసి కార్యకర్తలతో మమేకమవుతాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాను. ఈ కార్యక్రమం మొదలయ్యే లోగా మండల స్థాయి నుంచి మొదలై నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు పార్టీ అనుబంధ విభాగాల కమిటీల నియామకాలన్నీ పూర్తి చేయాలి. పార్టీ నిర్మాణం చాలా ముఖ్యమైన కార్యక్రమం. ఇదంతా ఆర్గనైజ్డ్‌గా తీసుకు రావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మీరు, నేను కలిసి మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు తీసుకుని పోదాం. విలేజ్ కమిటీలు, బూత్ కమిటీల నియామకం పూర్తి చేస్తాం.

### సోషల్ మీడియాలో మరింత చురుగ్గా ఉందాం

ఇవాళ మనం చంద్రబాబుతో యుద్ధం చేయడం లేదు.. చంద్రబాబు వేసుకున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లాంటి ముసుగుతో యుద్ధం చేస్తున్నాం. ఇలాంటి వాళ్లను ఎదుర్కోవాలంటే మనం సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉండాలి. జనరేషన్ మారింది. ప్రతి కార్యకర్తకు ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విటర్ వంటి అన్ని సోషల్ మీడియా అకౌంట్లు ఉండాలి. గ్రామ స్థాయిలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా ప్రశ్నించాలి. ఎవరికైనా పెన్షన్ రాకపోయినా, బిల్లుల బాదుడు పైనా ప్రశ్నిస్తూ ప్రతి గ్రామం నుంచి విప్లవ ధోరణిలో ప్రశ్నించాలి. గ్రామ స్థాయి నుంచే ప్రశ్నించే స్వరం ఉండాలి. అప్పుడే చైతన్యం వస్తుంది.

# సభలో అప్పుల గోల..!

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర దుమారం చెలరేగింది. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని అధికారం పక్షం.. ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ రూ.1.27 లక్షల కోట్లు అప్పు చేసిందని బీఆర్ఎస్ దుమ్మెత్తిపోసుకున్నాయి. బీఆర్ఎస్ హయాంలో రూ.7,11,911 కోట్ల అప్పు చేశారని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. పైగా, రిజర్వ్ బ్యాంక్ 'హ్యాండ్‌బుక్'లో చెప్పినట్లుగా తాము అంత అప్పు చేయలేదంటూ బీఆర్ఎస్ బుకాయిస్తోందని ఆరోపించారు. కార్పొరేషన్ల కోసం తెచ్చిన గ్యారెంటీ అప్పులను ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని, అందుకే ఇది కూడా ప్రభుత్వ అప్పుగానే భావించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరాలనే హ్యాండ్ బుక్‌లో పేర్కొన్నట్లు ఆర్‌బీఐ చెబుతోందని, అప్పట్లో ఆర్థిక మంత్రిగా వివరాలు ఇచ్చింది హరీశ్‌రావేనని గుర్తుచేశారు. తప్పుడు లెక్కలు చెప్పి, సభను తప్పుదారి పట్టించిన హరీశ్‌పై సభా హక్కుల ఉల్లంఘననోటీసు ఇవ్వాలా? లేక తనపై ఇవ్వాలా? సభనే తేల్చాలని భట్టి అన్నారు. కాగా, తాము చేయని అప్పును తమపై రుద్దుతున్నారని, పదేళ్లలో కేవలం రూ.4.17 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఇలా అప్పుల అంశం మల్లు భట్టి విక్రమార్క, హరీశ్‌మధ్య తీవ్ర దుమారాన్ని రేపింది. గురువారం ఇలా పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ వేడెక్కింది.

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన శ్వేతపత్రం, ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన హ్యాండ్ బుక్‌లలోని అంశాలను భట్టి కూలంకషంగా వివరించారు. బీఆర్ఎస్ పార్టీ తన హయాంలో మొత్తం రూ.6,71,757 కోట్ల అప్పు చేసిందని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి బీఆర్ఎస్ చేసిన బడ్జెట్ అప్పులు రూ.3,89,673 కోట్లు, వివిధ కార్పొరేషన్లకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీల మేరకు తీసుకున్న 'స్పెషల్ పర్పస్ వెహికల్' అప్పులు రూ.1,27,208 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీల మేరకు కార్పొరేషన్లు తీసుకున్న, తిరిగి కార్పొరేషన్లే చెల్లించే అప్పులు రూ.95,462 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీలు లేకుండా కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు రూ.59,414 కోట్లు.. మొత్తం రూ.6,71,757 కోట్లు అని వివరించారు. ఇవి కాకుండా బీఆర్ఎస్ దిగిపోయేనాటికే ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు, సంస్థలకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తం రూ.40,154 కోట్లు ఉన్నాయని, వాటినీ కలిపితే. అప్పులు రూ.7,11,911 కోట్లు అని చెప్పారు. ఏడాది కాలంలో ఎఫ్ఆర్‌బీఎం కింద తాము రూ.52,118 కోట్లు తెచ్చామన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులపై ఏడాదిలో అసలు, వడ్డీ కింద రూ.63,796 కోట్లు చెల్లించినట్లు వివరించారు.

### శుద్ధ తప్పు: హరీశ్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. తమ హయాంలో చేసిన అప్పు రూ.4,17,296 కోట్లు మాత్రమేనని, రూ.7 లక్షల కోట్ల అప్పు చేశామనడం శుద్ధ తప్పు అని అన్నారు. గతేడాది డిసెంబరులో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.1,27,708.84 కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఏడాదిలోనే ఇంత అప్పు తీసుకుంటే.. ఐదేళ్లలో రూ.6,38,544.22 కోట్ల అప్పు చేయనున్నట్లు కాంగ్రెస్ చెప్పకనే చెప్పిందన్నారు. తమ ప్రభుత్వంలో వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ, విద్యా సంస్థలకు చెల్లింపులను చేయలేదంటున్నారని, వాటిని నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే భట్టి గవర్నర్‌కు రాజీనామా ఇస్తారా? అంటూ సవాల్ విసిరారు. తాము చేయని అప్పును బీఆర్ఎస్ ఖాతాలో వేస్తే.. ప్రభుత్వానికి లీగల్ నోటీసులు ఇస్తామని, కోర్టుకెళతామని చెప్పారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు కూడా ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తోందని ఆరోపించారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు గజం భూమిని కూడా విక్రయించలేదని, కేవలం పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐఐసీకి భూములను బదలాయించే ప్రక్రియ మాత్రమే జరిగిందని స్పష్టం చేశారు.

# అనుకూల చరిత్ర రాయించుకున్నారు!

హైదరాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోపాటు తొలి, మలి దశల రాష్ట్ర సాధన ఉద్యమాల చరిత్రలో ఎంతోమంది త్యాగధనులకు, అమరులకు సముచిత స్థానం దక్కలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సమిధలైన వారి త్యాగాలకన్నా రాజకీయ ప్రయోజనాలు పొందిన వారి చరిత్రపైనే ఎక్కువ చర్చ సాగడం బాధాకరమన్నారు. గురువారం 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్లపాటు అధికారం చేతిలో ఉన్నవారు, తమకు అనుకూలమైన చరిత్రను రాయించుకొని అదే నిజమైన చరిత్ర అని సమాజంలో భ్రమలు కల్పించారని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. ఆ చరిత్రలోని వాస్తవాలను, అవాస్తవాలను ప్రజలు గుర్తించాలి అని సూచించారు. మరోవైపు, పుస్తక పఠనం అవసరాన్ని వివరిస్తూ.. 'డిజిటల్ యుగంలో రకరకాల సామాజిక మాధ్యమాల వల్ల పుస్తకాలకు ప్రాధాన్యం తగ్గింది. చరిత్ర చదవడం ద్వారా భవిష్యత్తుకు పునాదులు నిర్మించుకోవచ్చు అన్న ఆలోచన క్రమంగా సన్నగిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పుస్తకాల పండుగ భావితరాలకు ఒక స్ఫూర్తిని ఇవ్వాలి. చరిత్ర పఠనం ఆవశ్యకతను ఎలుగెత్తి చాటాలి. తద్వారా భవిష్యత్తుకు సరైన దశాదిశను నిర్దేశించుకోగలమన్న సందేశాన్ని ఈ వేదిక ద్వారా తెలియజెపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సామాజిక స్పృహను పెంపొందించడానికి తోడ్పడే పుస్తక ప్రదర్శనలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని, దీంట్లోభాగంగానే తనతో పాటు సహచర మంత్రులు ఈ పుస్తక మహోత్సవంలో పాల్గొంటున్నాం అని సీఎం రేవంత్ తెలిపారు. తమ కలం ద్వారా, గళం ద్వారా సామాజిక చైతన్యాన్ని అందించడమేగాక, ప్రజా పోరాటాల నిర్మాణానికి దోహదపడిన కవులు, రచయితల పేర్లు బుక్‌ఫెయిర్‌లోని పలు వేదికలకు పెట్టడం మంచి విషయమంటూ నిర్వాహకులను సీఎం అభినందించారు.

### పుస్తకాల నుంచే ఎంతో నేర్చుకున్నా

'కొత్తతరానికి తెలిసిందల్లా సమాచారం కోసం గూగుల్‌ను ఆశ్రయించడమే. అందులో ఎవరు సమాచారం ముందుగా పొందుపరిస్తే, దాన్నే నిజం అనుకుంటారు. తద్వారా వాస్తవం ఏమిటో బోధపడదు. నిజానికి, చరిత్ర పుస్తకాలు చదవడం ద్వారా గొప్పవ్యక్తుల త్యాగాలను తెలుసుకోగలం. అందుకే యువత తప్పనిసరిగా చరిత్ర పుస్తకాలు చదవాలి' అని రేవంత్ సూచించారు. పుస్తకాల ద్వారా సముపార్జించిన జ్ఞానంతోనే తాను.. ఉమ్మడి



ఏపీలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంలోనూ, అనంతరకాలంలో తెలంగాణ ఉద్యమ చరిత్ర రచనల్లోని అసమగ్రతను, వక్రీకరణలను ప్రశ్నించగలిగానని తెలిపారు. ఆనాడు సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి వంటి మహనీయులు మొదలు, తర్వాత కాలంలో గద్దర్, గూడ అంజన్న లాంటి కవులు, కళాకారులు ఎంతోమంది తనలాంటి వారికి నిజమైన తెలంగాణ ఆకాంక్షలను గుర్తెరగడానికి కావాల్సిన స్ఫూర్తిని అందించారన్నారు. అటువంటి పోరాట యోధుల ఉజ్వల చరిత్రను యువతరానికి అందించటానికి పుస్తక ప్రదర్శన ప్రధాన వేదిక కావాలని ఆకాంక్షించారు. కాగా, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీకి గ్రంథాలయం, పుస్తకావిష్కరణల వేదికతో కూడిన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సభాముఖంగా కార్యనిర్వాహకులు సీఎంను కోరారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ, శాశ్వత భవనం ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీకి అవసరమైన వసతుల మీద ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వవలసిన బాధ్యతను ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్.. పుస్తక పఠనం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రసంగించారు. రోజులో కనీసం అరగంటైనా పఠనానికి సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన 37 ఏళ్ల చరిత్రలో.. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి హాజరైన మొట్టమొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకూబ్ తెలిపారు.

# కక్ష సాధింపులొద్దు



అమరావతి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక వర్గాలపై అవిశ్వాస తీర్మానం పెట్టే సమయాన్ని కుదించరాదని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. వాటి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి, నవంబరుల్లో పూర్తవుతున్నందున ప్రత్యేకంగా పనిగట్టుకుని ఎందుకు దించేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. కక్ష సాధింపులు అవసరం లేదని.. విలువలతో కూడిన రాజకీయాలు చేద్దామని ఆయన స్పష్టం చేశారు. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా స్థానిక సంస్థల పాలక వర్గాలపై అవిశ్వాసం పెట్టే విషయమై చర్చ జరిగింది. గతంలో అవిశ్వాసం పెట్టడానికి ఏడాది సమయం ఉండేది. దానిని గత వైసీపీ ప్రభుత్వం మార్చి.. పదవీకాలం నాలుగేళ్లు పూర్తయ్యేవరకు అవిశ్వాసం పెట్టరాదని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యధిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీల మేయర్లు, చైర్‌పర్సన్లుగా వైసీపీకి చెందిన వారే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమయాన్ని కుదించడంపై కసరత్తు జరిగింది. అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి వీలు కల్పిస్తే వారందరినీ దించివేయడానికి అనేకచోట్ల టీడీపీ నేతలు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల పదవీకాలం రెండున్నరేళ్లు పూర్తికాగానే అవిశ్వాసం పెట్టడానికి వీలుకల్పిస్తూ పురపాలక శాఖ ఒక ప్రతిపాదనను కేబినెట్ ముందు ఉంచింది. పాలనపై దృష్టి పెడదామని, ఇప్పుడు అవిశ్వాస తీర్మానాలు పెట్టి ఉన్నవారిని దించే వ్యవహారాలు పెట్టుకోకపోవడం మంచిదని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఇప్పుడున్న పాలక వర్గాలకు ఇంకా ఎంత గడువుందని మంత్రి పొంగూరు నారాయణను సీఎం అడిగారు. 79 మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల పాలక మండళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగుస్తుందని, మిగిలిన వాటికి నవంబరులో పూర్తవుతుందని ఆయన బదులిచ్చారు. ఇంత కొద్ది సమయం ఉన్నవాటిని దించాల్సిన అవసరం లేదని సీఎం తేల్చిచెప్పారు. చైర్మన్ వేరే పార్టీ అయినప్పుడు జడ్పీ సమావేశాల్లో తీర్మానాలు చేయడానికి ఒక్కోసారి ఇబ్బంది ఎదురవుతోందని ఒక మంత్రి అనగా.. ముందుగానే అందరితో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని, దానికోసం చైర్మన్లను దించాల్సిన పని లేదని సీఎం సూచించారు. దీంతో ఆ ప్రతిపాదనను మంత్రివర్గం తిరస్కరించింది. రాజధాని అమరావతిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన అసెంబ్లీ భవనం లోపల డిజైన్లు ఎలా ఉండాలో నిర్ణయించడానికి స్పీకర్ అధ్యక్షతన ఒక కమిటీ నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. భవనం భౌతిక డిజైన్ ఇప్పటికే పూర్తయినందున అందులో మార్పులు ఉండవని.. లోపల ఎలా ఉండాలో.. ఏయే అవసరాలకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలో కమిటీలో చర్చించి సూచనలు ఇవ్వాలని సీఎం చెప్పారు. అసెంబ్లీ భవనం పైన ఉండే టవర్ విజయవాడ, గుంటూరు నుంచి కూడా కనిపిస్తుందని, ఇంత పెద్ద టవర్ దేశంలో మరే అసెంబ్లీకి లేదని తెలిపారు. 47 అంతస్థులతో నిర్మించబోయే సచివాలయ టవర్‌లో ప్రతి శాఖ మంత్రి, కార్యదర్శి, శాఖాధిపతి ఒకేచోట ఉండేలా చూడాలని ఆదేశించారు. శాఖాధిపతులకు సందర్శకుల తాకిడి ఉంటుందని, వాటిని వేరేచోట పెడితే బాగుంటుందని మంత్రి లోకేశ్ అన్నారు. ఇందుకు సీఎం అంగీకరించలేదు. గిరిజన వర్సిటీ కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన స్థలాన్ని గత జగన్ సర్కారు మార్చిందని.. అక్కడే నిర్మాణం కొనసాగిద్దామని ఆయన చెప్పారు. రాజధాని నిర్మాణ పనులు జనవరిలో ప్రారంభమవుతాయని మంత్రి నారాయణ తెలిపారు. హడ్కో రుణంతో చేపట్టే పనులు సంక్రాంతి తర్వాత మొదలవుతాయని, ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే పనులు ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఈ రెండు మార్గాల నుంచి అందే నిధులు రూ.31వేల కోట్లు ఉంటాయని, చాలా పనులు వీటితోనే పూర్తవుతాయన్నారు.

# పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ!

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఓ మహిళా ఎంపీ తన పట్ల రాహుల్‌గాంధీ అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ తోసేయడం వల్లే తమ ఎంపీలు గాయపడ్డారని బీజేపీ ఆరోపించగా.. తొలుత వాళ్లే తనను నెట్టివేశారని, తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా తోసివేస్తే ఆయన మోకాలికి గాయమైందని రాహుల్ గాంధీ అన్నారు. తమ సభ్యులపై హత్యాయత్నం జరిగిందని బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ రాహుల్‌గాం?ధీపై పార్లమెంట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. 84 ఏళ్ల ఖర్గే పట్ల బీజేపీ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ ఎంపీలు దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్ తదితరులు అదే స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. రెండు పార్టీల నేతలు పరస్పరం నిందించుకుంటూ, జరిగిన ఘటనపై దర్యాప్తు జరిపించాలంటూ ఉభయ సభల అధ్యక్షులకు లేఖలు రాశాయి. ఇరు వర్గాలూ తమ కథనాల ను సమర్థించుకుంటూ వీడియోలు విడుదల చేశాయి. ఈ మొత్తం ఉదంతం ఉభయ సభలను కుదిపివేయడంతో గందరగోళం, నినాదాల మధ్య ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా శుక్రవారానికి వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాలు ప్రారంభం కావటానికి ముందే ఎన్‌డీఏ, ఇండియా ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. అమిత్ షా వ్యా ఖ్యలను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సుప్రియా సూలేతో పాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎస్పీ, ఎన్సీపీ (శరద్‌పవార్), వామపక్షాలు తదితర పార్టీల సభ్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్‌కు సంకేతంగా పలువురు ఎంపీలు నీలి రంగు టీషర్టులు ధరించారు. నిరసన అనంతరం ఊరేగింపు గా.. పార్లమెంటులోకి ఎంపీల ప్రవేశద్వారమైన మకర ద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ సమయంలో మకరద్వారం వద్ద అధికారపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని, దానికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలంటూ వారు నినాదాలిచ్చారు.

# రేవంత్ కుట్రలు సాగవు

## కేటీఆర్ పై అన్యాయంగా కేసులు నమోదు

### ప్రతిపక్షాల గొంతను అణిచేందుకు ప్రయత్నం

### అసెంబ్లీ వేదికగా కేటీఆర్ చేసిన సవాల్ కు పారిపోయిన సీఎం

### చర్చ పెడితే నిజాలు ప్రజలకు తెలుస్తాయని కాంగ్రెస్ కు భయం

### కాంగ్రెస్ సర్కార్ నిరంకుశత్వంపై పోరాటం చేస్తాం

### భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ ధ్వజం

**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్ :** భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ మండిపడ్డారు. కేటీఆర్ పై అక్రమంగా కేసులను బనాయిస్తున్నారన్నారని మండిపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేసుతో హైదరాబాద్ ఇమేజ్ ను పెంచారన్నారు. కానీ కాంగ్రెస్ సర్కార్ దాన్నీ జీర్ణించుకోలేక లేనిపోనివి సృష్టించి బద్నాం చేసే కుట్రలకు పాల్పడుతుందన్నారు. అసెంబ్లీ వేదికగా కేటీఆర్ సవాల్ విసిరారని, కానీ కాంగ్రెస్ బయపడి చర్చ పెట్టకుండా పారిపోయిందన్నారు. అసెంబ్లీలో చర్చ పెడితే ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఎక్కడ నిజాలు ప్రజలకు తెలిసిపోయి కాంగ్రెస్ కుట్రలు బయటపడతాయని, అందుకే చర్చ పెట్టకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ పై అన్యాయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని, ఇది ముమ్మాటకి కుట్రపూరితమేనని విమర్శించారు. ఓఆర్ఆర్ పై సిట్ విచారణ అంటూ సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఔటర్ టెండర్ ల విషయంలో అవకతవకలు జరగలేదని, చట్ట ప్రకారంగా గత ప్రభుత్వం ముందుకు వెళ్లినట్లుగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై పోరాడేందుకు భారాస శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రానుంది భారాస సర్కార్ అని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.



## శంకర్‌పల్లి ప్రైవేట్ బస్సు డ్రైవర్లు, ఓనర్లకు ఆర్టీవో, పోలీసు అధికారుల సూచనలు

**శంకర్‌పల్లి డిసెంబర్ 19:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం ప్రైవేటు బస్సు డ్రైవర్లు, ఓనర్లకు ఆర్టీవో, పోలీసు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎంవిఐ సునీత మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ప్రైవేటు, టాక్సీ ప్లేట్ వాహనాలు తెలంగాణ రాష్ట్రం లోకి వచ్చినప్పుడు స్థానిక డ్రైవర్లు, ఓనర్లు వాహనాలను ఆపి ప్రయాణికులను ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులు, చెక్ పోస్ట్ ల వద్ద ఆర్టీవో అధికారులు వాహనాలను పట్టుకుంటారని తెలియజేశారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.






## ఎల్వెర్తి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎస్ జె డబ్ల్యూ హెచ్ఆర్ సి) ఆధ్వర్యంలో స్వెటర్ల పంపిణీ

**శంకర్‌పల్లి డిసెంబర్ 19:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని ఎల్వెర్తి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 38 మంది విద్యార్థిని, విద్యార్థులకు చలి నుండి రక్షణ కోసం, చలితీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గురువారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు శంకర్‌పల్లి ఎస్ జెడబ్ల్యూ హెచ్ఆర్ సి మున్సిపల్ చైర్మన్ గండేటి రాజేష్ గౌడ్ రాజశ్రీ దంపతులు స్వెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శాంతి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సును కోరుతూ వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సామాజిక సేవలో భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. రాజేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో అధిగమించి, జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. మానవ హక్కుల పరిరక్షణ తమ ధ్యేయం అన్నారు. తమ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో తాము కూడా భాగస్థులమైఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, మహేందర్, విజయలక్ష్మి, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి: మోకిల ఏఎస్ఐ పద్మ



శంకర్‌పల్లి డిసెంబర్ 19:(డైలీ రిపోర్ట్): విద్యార్థిలను, మహిళలను ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే 1930నకు కాల్ చేయాలని మోకిల ఏఎస్ఐ పద్మ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మహారాజ్ పేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ పద్మ మాట్లాడుతూ విద్యార్థినిలు మహిళలు భయపడకుండా తమను ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.పోలీసులకు ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందన్నారు. అదే విధంగా సెల్ ఫోన్లలో, ఇంస్టాగ్రాం, వాట్సాప్, ఫేస్బుక్ లాంటి వాటిలలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగులు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పిఎస్ఐ శివాని, ప్రధానోపాధ్యాయులు అంజయ్య ఉన్నారు.

## పోలీసులను మర్యాదపూర్వకంగా కలిసిన చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్





**శంకర్ పల్లి డిసెంబర్ 19:(డైలీ రిపోర్ట్):** చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్ మోకిల పోలీస్ స్టేషన్ కి నూతనంగా వచ్చిన డిటెక్టివ్ సీఐ సమరంను మర్యాదపూర్వకంగా కలిశారు. తదుపరి డీఐ సమరం, ఎస్ఐ కోటేశ్వర్ రావులను శాలువాతో సత్కరించారు. మహిపాల్ మాట్లాడుతూ.. పోలీసులు రాత్రింబవళ్లు శ్రమించి ప్రజలకోసం పని చేస్తున్నారని అన్నారు. మోకిల గ్రామ పంచాయతీ చెందిన ట్రాక్టర్ దొంగలు ఎత్తుకెళ్లిన విషయం లో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ట్రాక్టర్ మహారాష్ట్ర లో ఉంది అని గుర్తించి తీసుకొచ్చిన ఘనత మోకిల పోలీస్ సిబ్బంది కి దక్కింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశీనాథ్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మహిపాల్, భీష్మ, చిన్న, చందు పాల్గొన్నారు .



## డ్రైనేజీ ఔట్ లెట్ సమస్య పరిశీలిన యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆదేశం...

**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ లో భూగర్భ డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య మరియు డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యపై గురువారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జలమండలి అధికారులు మరియు స్థానిక నేతలు తొ కలిసి పర్యటించారు. ఈ మేరకు. భూగర్భ డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య మరియు డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ఆదేశించారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ డయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.గత నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కృషి చేయడం నా ధ్యేయం" అని తెలిపారు.ఎలాంటి సమస్య ఉన్న ఇబ్బంది పడకుండా తనని సంప్రదించాలని స్థానికులకు హామీ ఇచ్చారు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి .ఈ కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు జలేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కృష్ణ మూర్తి,సీనియర్ నాయకులు, నల్లగండ్ల హుడా కాలనీ వాసులు,స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

### జాతీయ రైతు దినోత్సవం సదస్సులో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



**ఢిల్లీ /ఏలూరు, డిసెంబరు 19:( డైలీ రిపోర్ట్):** రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో గురువారం జరిగిన సదస్సుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గా పిలిచే ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 90 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఎంపీ తెలిపారు. ఏలూరు జిల్లాలో మెట్ట, మాగాణి, వాణిజ్య వంటి అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నారని, రైతుల సమస్యల పరిష్కారం కోసం తాను కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. తాను ఎంపీగా విజయం సాధించిన అనంతరం పామాయిల్, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించినట్లు ఎంపీ వెల్లడించారు. ఎన్నికల సమయంలో పామాయిల్ టన్ను రూ.12 వేలు ధర పలకగా రూ.17 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడటంతో ప్రస్తుతం రైతులకు రూ.20 వేలు పైచిలుకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఎంపీ తెలిపారు. పంట ఉత్పత్తిపై పరిమితి ఉండటం వల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని పొగాకు సాగు చేస్తున్న రైతులు ఎంపీగా గెలిచిన మరునాడే తన ఎదుట గోడు వెళ్ళబోసుకున్నారని, సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంట ఉత్పత్తి పరిమితిని ఎత్తి వేయించడం వల్ల పొగాకు రైతులకు రూ.110 కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఎంపీ స్పష్టం చేశారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గించాలని ప్రస్తుతం 28 శాతం ఉన్న జీఎస్టీని 34 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, తద్వారా రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున జీఎస్టీ పెంచవద్దని ఇప్పటికే తాను కేంద్ర పెద్దలకు విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ తెలిపారు. త్వరలోనే దీనిపై పొగాకు బోర్డు చైర్మన్, కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్ అందించడంతో పాటు రాయితీపై విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. రైతులకు మరింతగా గిట్టుబాటు ధర కల్పించడానికి ఏలూరు జిల్లా పరిధిలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు.





# ప్రగ్యా జైశ్వాల్ ఏ క్రికెటర్‌తో డేట్‌కు వెళ్లాలనుకుంటుందో తెలుసా..?

కంచె సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యాజైశ్వాల్ ఆ తర్వాత అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది. ఈ జబల్ పూర్ భామ తాను సింగిల్‌గా ఉన్నానని, తనకు ఇష్టమైన వ్యక్తితో మింగిల్ అయ్యేందుకు రెడీగా ఉన్నానని చెప్పి అందరికీ షాకిచ్చింది.ఓ ఇంటర్వ్యూలో మీరు ఒకవేళ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఏ క్రికెటర్‌ను సెలెక్ట్ చేసుకుంటారని ప్రశ్నించాడు యాంకర్. శుభ్‌మన్ గిల్ పేరు చెప్పడంతోనే.. పెద్దగా నవ్విన ప్రగ్యాజైశ్వాల్.. ఎందుకు కాదు..? విధి తలిస్తే ఏదైనా జరుగొచ్చు. నేను విధిని నమ్ముతానంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. ప్రగ్యా జైశ్వాల్ ప్రస్తుతం బాలకృష్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న డాకు మహారాజ్‌లో నటిస్తుండగా.. షూటింగ్ పూర్తయింది.ఇక అఖండ 2లో మరోసారి బాలకృష్ణకు జోడీగా కనిపింబోతుంది. రామోజీఫిలిం సిటీలో వేసిన సెట్‌లో సీక్వెల్ షూటింగ్ మొదలు కానుంది. ప్రగ్యా జైశ్వాల్ మరోవైపు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తోన్న టైసన్ నాయుడు చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



# ఇదో భావోద్వేగ ప్రయాణం


మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'ముఫాసా- ది లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకుడు. 2019లో వచ్చిన యానిమేటెడ్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్'కి కొనసాగింపుగా వాల్ట్ డిస్నీ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా రూపొందింది. ఇందులో ప్రధాన పాత్ర అయిన 'ముఫాసా'కి అగ్ర హీరో మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఈ సినిమా పోస్టర్‌ని ఆదివారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నమ్రత మాట్లాడుతూ 'ఇది ఫ్యామిలీ ఎమోషనల్ రైడ్. మహేశ్ చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.' అని తెలిపారు. ఇంకా ఇందులోని కీలక పాత్రలైన టాకా, టిమోన్ పాత్రలకు వాయిస్ ఓవర్స్ ఇచ్చిన సత్యదేవ్, అలీ కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. ఇందులోని పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ వాయిస్ ఓవర్స్ ఇచ్చారు. డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# యువ దర్శకునితో మెగా ప్రాజెక్ట్?



ఒక్క సినిమా డైరెక్ట్ చేసిన వశిష్ఠకు, తన సినిమాను డైరెక్ట్ చేసే ఛాన్స్ ఇచ్చేశారు చిరంజీవి. ఆ సినిమానే 'విశ్వంభర'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే.. 'విశ్వంభర' తర్వాత మరో కుర్ర డైరెక్టర్‌తో సినిమా చేయనున్నారట చిరంజీవి. తనెవరో కాదు, 'దసరా'తో నానికి భారీ విజయాన్ని ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల. ప్రస్తుతం నానితోనే 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు శ్రీకాంత్. ఈ సినిమా తర్వాత మెగా మూవీకి ఆయన రెడీ అవుతారనేది లేటెస్ట్ న్యూస్. ఇటీవలే చిరంజీవికి ఆయన ఓ కథ వినిపించారని, ఆ కథ చిరంజీవికి కూడా బాగా నచ్చిందని, బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేయమని శ్రీకాంత్‌ని చిరంజీవి ఆదేశించారనేది ఫిల్మ్‌వర్గాల్లో బలంగా వినిపిస్తున్న టాక్. చిరంజీవి 'విశ్వంభర', శ్రీకాంత్ ఓదెల 'ప్యారడైజ్'.. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాక, ఈ మెగా ప్రాజెక్ట్ ఉంటుందట. ఈ వార్త ఫిల్మ్ వర్గాల్లో పొక్కడంతో కుర్ర డైరెక్టర్లకు అవకాశాలిస్తూ భిన్నమైన ప్రయాణాన్ని చిరంజీవి సాగిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆ వార్తలో నిజమెంత?



ప్రస్తుతం రవితేజ 'మాస జాతర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మే9న విడుదల కానుంది. ఇదిలావుంటే.. రవితేజ లైనప్ విషయంలో ఓ క్రేజీ న్యూస్ ఒకటి వినిపిస్తున్నది. తమిళంలో ఓ స్టార్ హీరో నటిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమాలో ప్రత్యేక పాత్ర చేయడానికి రవితేజ అంగీకరించారట. వివరాల్లోకెళ్తే.. సూర్య కథానాయకుడిగా ఆర్.జె. బాలాజీ దర్శకత్వంలో ఓ భారీ పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలోనే రవితేజ స్పెషల్ రోల్ చేయనున్నారట. ఇటీవలే రవితేజకి దర్శకుడు బాలాజీ క్యారెక్టర్‌ని నరేట్ చేశారని, పాత్ర నచ్చడంతో నటించేందుకు రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ విషయం ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ఏడాది చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ స్పెషల్ రోల్ చేసిన విషయం తెలిసిందే.



# నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు

రజనీకాంత్ 'జైలర్'లో 'వా.. కావాలయ్యా.. దా.. దా..' అంటూ ఐటమ్ నంబర్లో చెలరేగిపోయింది తమన్నా. ఆ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా.. ఆ పాట, అందులో తమన్నా నాట్యాభినయం కొన్ని నెలలపాటు సోషల్ మీడియాను కుదిపేశాయనే చెప్పాలి. రీసెంట్‌గా 'స్త్రీ 2'లో కూడా ఓ చిన్న పాత్ర చేశారు తమన్నా. అందులో కూడా 'ఆజ్ కీ రాత్..' పాటలో సందడి చేశారు. ఆ సినిమా ఏకంగా 900కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో 'తమన్నా ఐటమ్ సాంగ్ చేస్తే సినిమా హిట్' అనే సెంటిమెంట్ మొదలైంది. మామూలుగానే సినిమావాళ్లకు సెంటిమెంట్లు ఎక్కువ. అందుకే.. దర్శక, నిర్మాతలంతా ఐటమ్ సాంగ్స్ చేయమంటూ తమన్నా ఇంటిముందు క్యూ కడుతున్నారట. దాంతో తమన్నా అసహనం వ్యక్తం చేశారు. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను చేసిన పాటలు ఆ సినిమాల సక్సెస్‌లకు హెల్ప్ అవ్వడం ఆనందంగానే ఉంది. అందుకని, వరుసగా ఐటమ్ నంబర్లే చేయమంటే ఎలా? 'జైలర్' రజనీసార్ సినిమా అవ్వడంతో ఇష్టంతో చేశా. 'స్త్రీ2' డైరెక్టర్ అమర్ కౌశిక్ నాకు మంచి ఫ్రెండ్. తను అడగ్గానే కాదనలేక చేశా. అంతేతప్ప అదేపనిగా ఈ తరహా పాటలు చేయడానికి నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు..' అంటూ అసహనం వ్యక్తం చేసింది తమన్నా భాటియా.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707